నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I హైదరాబాద్, గురువారం 28 నవంబర్ 2024 RANGAREDDY

## డిసెంబర్ 11 వరకు నరేందర్‌రెడ్డి రిమాండ్ పొడిగింపు



**కస్టడీ పిటిషన్‌పై విచారణ డిసెంబర్ 2వ తేదికి వాయిదా**

**నేటికి వాయిదాపడిన బెయిల్ పిటిషన్ విచారణ**

వికారాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): లగచర్ల కేసులో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి రిమాండ్‌ను పొడిగిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బుధవారంతో 14 రోజుల రిమాండ్ ముగియగా, మరో 14 రోజులపాటు (డిసెంబర్ 11 వరకు) రిమాండ్ పొడిగిస్తూ కొడంగల్ కోర్టు ఉత్తర్వులిచ్చింది. ఈ నెల 13న నరేందర్‌రెడ్డిని అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఇప్పటివరకు 71 మందిని గుర్తించగా, 29 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యేను కస్టడిలోకి అప్పగించాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేసిన కొడంగల్ కోర్టు డిసెంబర్ 2వ తేదీకి కస్టడీ పిటిషన్‌పై విచారణను వాయిదా వేసింది. అదేవిధంగా పట్నం నరేందర్‌రెడ్డి బెయిల్ కోసం వికారాబాద్ జిల్లా కోర్టులో దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ గురువారానికి వాయిదా వేస్తూ జిల్లా కోర్టు ఉత్తర్వులిచ్చింది.

## 'మీ కొడుకు మా కస్టడీలో ఉన్నాడంటూ' ఫోన్‌కాల్

**డబ్బు కాజేసిన సైబర్ నేరగాళ్లు**

బంజారాహిల్స్, నవంబర్ 27 : 'మీ కొడుకు మా కస్టడీలో ఉన్నాడంటూ..' సైబర్ నేరగాళ్లు ఫోన్‌కాల్ చేసి బెదిరించి రూ.1.80 లక్షలు కాజేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం.3లోని లేడీస్ హాస్టల్‌లో ఉంటూ మేకప్ ఆర్టిస్ట్‌గా పని చేస్తున్న పూజా రౌతేలా(35)కు ఈ నెల 25న ఉత్తరాఖండ్‌లో నివాసముంటున్న ఆమె అక్క మీనాక్షి చౌదరి(42) ఫోన్ చేసింది. తనకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడని, తన కొడుకు వారి కస్టడీలో ఉన్నాడని చెప్పారని, వారు సూచించిన ఫోన్ నంబర్‌కు డబ్బులు వేయకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించారని మీనాక్షి చౌదరి చెప్పింది. దీంతో ఆందోళనకు గురైన పూజా రౌతేలా తన అకౌంట్ల నుంచి గూగుల్ పే ద్వారా గణేశ్ మీనా( పప్పు కుమార్) అనే వ్యక్తి అకౌంట్‌కు రూ.1,80,000 పంపించింది. డబ్బులు పంపిన కాసేపటికే మీనాక్షి చౌదరి కొడుకు ఇంటికి వచ్చాడు. తనను ఎవరూ తీసుకెళ్లలేదని అతడు చెప్పడంతో ఇదంతా సైబర్ నేరగాళ్ల మోసమని గుర్తించిన పూజా రౌతేలా మంగళవారం రాత్రి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బీఎన్ఎస్ 318(2), 319(2)తోపాటు ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



షాద్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

# 29న దీక్షా దివస్

- బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్
- విజయవంతం చేయాలని పిలుపు

షాద్‌నగర్, నవంబర్ 27 : ఈ నెల 29న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా నలుమూలల నుంచి కార్యకర్తలు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం షాద్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల బెదిరింపులకు, అక్రమ కేసులకు భయపడొద్దని, ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీని నమ్మే స్థితిలో ప్రజలు లేరని.. నాటి కేసీఆర్ పాలనలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాల ఫలాలు, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సర్కారు పనితీరును ఎక్కడికక్కడ ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్. నటరాజన్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గణేశ్, మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ, దేవేందర్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, వీరేశం, చందూనాయక్, మండలాల నాయకులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

**వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, నవంబర్ 27 : డయల్ 100 కాల్స్‌పై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ అధికారులు పెండింగ్ కేసులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కేసులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. ప్రజలకు పోలీస్ అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. సీసీ కెమెరాలపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని పేర్కొన్నారు. పోలీస్ వాహనాలను ఎప్పటికప్పుడు సర్వీసింగ్ చేసి మంచి కండిషన్‌లో పెట్టుకోవాలని సూచించారు. అనంతరం కేసులకు సంబంధించిన ఫైల్స్‌ను ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, పరిగి, వికారాబాద్, తాండూరు డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలున్నారు.



సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు

# తేమ పేరిట దోపిడీ..!

## సీసీఐ, మిల్లర్లు కలిసి కుమ్మక్కయ్యారని రైతుల ఆరోపణ

వికారాబాద్ జిల్లాలో పత్తి రైతులకు ప్రతి ఏటా ఏదో రకంగా కష్టాలు ఎదురవుతున్నాయి. పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యమై బహిరంగ మార్కెట్‌లో తక్కువ ధరకు విక్రయించిన రైతులు.. ప్రస్తుతం తేమ పేరిట దోపిడీకి గురవుతున్నారు. పత్తిలో 8 శాతం కంటే ఎక్కువగా ఉంటే మద్దతు ధర తక్కువగా వస్తుంది. అయితే పలు జిన్నింగు మిల్లుల్లో రైతులు తెచ్చిన పత్తిలో తేమ సాధారణ స్థాయిలో ఉన్నా ఎక్కువ శాతం ఉందంటూ మోసం చేస్తున్నారు. సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) నిబంధనల ప్రకారం.. పత్తిలో తేమ శాతం 8 ఉంటే క్వింటాలుకు మద్దతు ధర రూ.7521, 9 శాతం ఉంటే రూ.7445, 10 శాతం ఉంటే రూ.7370 చెల్లించాల్సి ఉంటుంది. తేమ శాతం 9-10 ఉన్నా 12 శాతం కంటే ఉందంటూ రూ.7000లకే కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. సీసీఐ అధికారులతోపాటు జిన్నింగ్ మిల్లుల యజమానులు కుమ్మక్కు అవుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. విక్రయించేందుకు తీసుకువచ్చిన పత్తిని రైతులు తిరిగి తీసుకెళ్లే పరిస్థితి లేనందున.. ఇదే అదనుగా భావించి అధికారులు, యజమానులు దోచుకుంటున్నారు. జిల్లాలో ఈ ఏడాది 2.40 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా.. 2 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటివరకు 12,736 మంది రైతుల నుంచి 30,479 మెట్రిక్ టన్నులను సీసీఐ కొనుగోలు చేసింది.

- వికారాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ)





- సీసీఐ, మిల్లర్లు కలిసి కుమ్మక్కయ్యారని రైతుల ఆరోపణ
- పత్తి మద్దతు ధర క్వింటాలుకు రూ.7521 కాగా.. రూ.7వేల నుంచి రూ.7200లకు మాత్రమే కొనుగోలు చేస్తున్న సీసీఐ
- పెట్టుబడి కూడా రావడం లేదంటూ అన్నదాతల ఆవేదన
- చెల్లింపుల్లో కూడా జాప్యమే..
- రూ.229 కోట్లకు ఇప్పటివరకు జరిగిన చెల్లింపులు రూ.59 కోట్లే..
- 12,736 మంది రైతుల నుంచి 30,479 మెట్రిక్ టన్నుల పత్తి సేకరణ

### చెల్లింపుల్లో తీవ్ర జాప్యం

పత్తి విక్రయాల్లో కొర్రీలు పెడుతున్న సీసీఐ డబ్బులు చెల్లించడంలోనూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నది. ఐదారు రోజుల్లోనే చెల్లింపులు చేస్తామని చెబుతున్నప్పటికీ.. నెల రోజులు అవుతున్నా డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కాకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి కారణం సీసీఐ కొనుగోలు కేంద్రాల సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు రూ.229.49 కోట్ల విలువైన పత్తిని రైతుల నుంచి సేకరించగా.. ఇప్పటివరకు కేవలం రూ.59 కోట్లను మాత్రమే సీసీఐ రైతుల ఖాతాల్లో జమచేసింది. మరో రూ.170 కోట్ల చెల్లింపులు చేపట్టాల్సి ఉన్నది. జిల్లావ్యాప్తంగా 14 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా.. 12,736 మంది రైతుల నుంచి 30,479 మెట్రిక్ టన్నుల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది.

### త్వరగా చెల్లింపులయ్యేలా చర్యలు

తేమ శాతం తక్కువగా ఉన్నా ఎక్కువగా ఉన్నట్లు చూపించి తక్కువ ధరకు పత్తి కొనుగోలుకు సంబంధించి మా దృష్టికి రాలేదు. మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం. కొనుగోలు కేంద్రాల్లో కూడా తనిఖీలు చేస్తాం. పత్తిని విక్రయించిన రైతులకు త్వరగా చెల్లింపులు పూర్తయ్యేలా సీసీఐ అధికారులకు సూచిస్తాం. వెంటనే బిల్లులు చేయకపోవడంతోపాటు సీసీఐ నుంచి పేమెంట్స్ పెండింగ్‌లో ఉండటంతో చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నది.

- సారంగపాణి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి


# చెరువుల్లో ఆక్రమణలను తొలగిస్తాం!

**ఏడు చెరువులను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్**

**పునఃపరిశీలించి సర్వే రిపోర్టుల ఆధారంగా చర్యలు**

**ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల సరిహద్దులు ఆక్రమించారంటూ హైడ్రాకు ఫిర్యాదులు**

సిటీబ్యూరో/మణికొండ, దుండిగల్, మెహిదీపట్నం, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): చెరువులకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించి కబ్జా కాకుండా చూడాలని, ఆక్రమణలపై పూర్తిస్థాయిలో సమీక్షించి సర్వే నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. చెరువుల కబ్జాలపై హైడ్రా కార్యాలయానికి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో కమిషనర్ రంగనాథ్ తన బృందంతో పాటు స్థానిక అధికారులతో కలిసి బుధవారం గ్రేటర్ పరిధిలోని ఏడు చెరువులను సందర్శించారు. నిజాంపేటలోని నిజాంతలాబ్ చెరువు (తురక చెరువు), మాదాపూర్‌లోని మేడికుంట చెరువు, ఈదులకుంట, నార్సింగ్‌లోని నెక్నాంపూర్ చెరువు, తెల్లాపూర్‌లోని వనం చెరువు, చెల్లికుంట, మేళ్ల చెరువులను సందర్శించారు. మేడ్చల్ జిల్లా నిజాంపేట మున్సిపాలిటీ పరిధిలోని తుర్కచెరువులో ఆక్రమణలతో పాటు కలుషితనీరు కలుస్తుందన్న ఫిర్యాదుతో ఆ చెరువును రంగనాథ్ సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. చుట్టుపక్కల గేటెడ్ కమ్యూనిటీల నుంచి మురుగునీరు చేరి పలు చెరువులు కలుషితమవుతున్నాయని స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో ఉన్న ఈదుల కుంట చెరువును రంగనాథ్ రెవెన్యూ, హైడ్రా అధికారులతో కలిసి పరిశీలించారు. తెల్లాపూర్‌లోని వనం చెరువు, చెల్లికుంట, మేళ్ల చెరువులను సందర్శించిన రంగనాథ్‌కు స్థానికులు అక్కడ ఉన్న పరిస్థితులను స్పష్టంగా వివరించారు. గతంలో పనిచేసిన ఇరిగేషన్ అధికారులు ఆక్రమణలకు ఎన్వోసీ ఇచ్చారని, వాటిపై కూడా రంగనాథ్ దృష్టిపెట్టాలని కోరారు. చెల్లికుంట వద్ద కల్వర్టు కట్టారని, అసలు పర్మిషన్ ఇవ్వకూడని చోట ఇచ్చారంటూ చెల్లికుంట అలుగు దాటితే వరద వస్తుందని చెప్పారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ గ్రామ చిన్న, పెద్ద చెరువులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్థానిక అధికారులతో కలిసి సందర్శించారు. గత కొన్ని రోజులుగా స్థానిక సిటిజన్ కౌన్సిల్, ధృవాన్ష్ సంస్థ ప్రతినిధులు చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు ఆక్రమణలకు గురవుతున్నాయంటూ హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో రంగనాథ్ చెరువుల స్థితిగతులపై స్థానిక ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెద్ద చెరువు ఎగువ ప్రాంతంలో చెరువు భూములను క్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారంటూ కమిషనర్ రంగనాథ్ దృష్టికి తీసుకువచ్చారు. లేక్‌వ్యూ విల్లాల పేరిట జరుగుతున్న నిర్మాణాల్లో 11 విల్లాల వరకు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపడుతున్నారని.. అందులో ఐదు నిర్మాణాలను కూల్చివేసినా తిరిగి నిర్మాణాలు జరుగుతున్నాయని ఇరిగేషన్ అధికారులు రంగనాథ్‌కు తెలిపారు. అనంతరం చిన్నచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల పరిధులను ఆయన పరిశీలించారు. వారం రోజులుగా చిన్నచెరువు బఫర్‌జోన్ పరిధుల పరిరక్షణలో భాగంగా ఇరిగేషన్ అధికారులు చేపట్టిన ఫెన్సింగ్ పనులను పర్యవేక్షించారు. ఇక్కడ ఎగువ ప్రాంతంలోనూ చెరువు భూములు ఆక్రమణలకు గురయ్యాయంటూ ఫిర్యాదుదారులు తెలిపారు. ఇందుకు స్పందించిన ఇరిగేషన్ శాఖ జేఈ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎగువ ప్రాంతంలో ఎక్కడా చెరువు సరిహద్దులు ఆక్రమణలకు గురికాలేదని.. ఫెన్సింగ్ వేసే సమయంలో తవ్వి మట్టి కుప్పలు వేసినట్లు చెప్పారు. తమ శాఖ ఆదేశాల మేరకే ఎఫ్‌టీఎల్ సరిహద్దులో ఫెన్సింగ్ పనులను చేపడుతున్నట్లు వెల్లడించారు. పూజా కన్‌స్ట్రక్షన్ అపార్ట్‌మెంట్‌లో సగానికి పైగా చెరువు ఎఫ్‌టీఎల్‌లోకి వస్తుందని వారు హైడ్రా కమిషనర్‌కు తెలిపారు. రెండు చెరువుల సరిహద్దులపై స్పష్టమైన నివేదికలను సిద్ధం చేసి అందజేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ కోరారు. నివేదికలను పరిశీలించిన తర్వాత మరోసారి చెరువులను సందర్శిస్తానన్నారు. చెరువుల పరిరక్షణ కోసం ఎక్కడికక్కడ చెరువుల చుట్టూ ఫెన్సింగులు వేసి కాపాడేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులు పొంది జరుగుతున్న నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకోబోమని వెల్లడించారు. చెరువుల భూములు ఆక్రమణలకు గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఇరిగేషన్ శాఖ అధికారులకు ఉంటుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. చెరువుల పర్యటనలో రంగనాథ్ వెంట హైడ్రా అధికారులు, రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



చెరువుల్లో ఆక్రమణలపై స్థానికులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

# తప్పులెన్ని చేసినా.. అండా దండా

**సెటిల్‌మెంట్ కింగ్‌లకు రాజకీయ అండ**

**ఏం చేసినా.. ఎవరూ ఏమీ చేయలేరనే ధీమా**

**పోలీస్ శాఖలో కొందరు అధికారుల తీరిది**

**చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారుల దాటివేత ధోరణి**

**సీపీలో అప్పుడున్న దూకుడు ఏమైందనే చర్చ**

సిటీబ్యూరో, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): ఏ తప్పు చేసినా.. రక్షించేందుకు రాజకీయ నాయకులైన గాడ్ ఫాదర్స్ ఉన్నంత వరకు తమను ఎవరూ ఏమీ చేయలేరనే ధీమాతో నగరంలో కొందరు అధికారులు చెలరేగిపోతున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో పనిచేస్తున్న కొందరు సీఐలు, ఏసీపీలపై వచ్చిన అవినీతి, అక్రమాలకు సంబంధించిన ఆరోపణలపై ఉన్నతాధికారులు అంతర్గత విచారణ చేసి చర్యలు తీసుకోవాలని చూసినా.. వారిని నీడలా కాపాడే రాజకీయ నాయకులైన గాడ్ ఫాదర్స్ ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు తెచ్చి తమ వారిపై ఈగ వాలనీయకుండా ఉండేలా చూసుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. అతిగా ఆలోచించడం కంటే చూసీచూడనట్లు పోవడమే బెటర్ అనే ధోరణితో ముందుకు సాగుతున్నారు. హైదరాబాద్ కమిషనర్‌గా గతంలో పనిచేసిన కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సమయంలో ఆరోపణలొస్తే వెంటవెంటనే అంతర్గత విచారణ చేసి చర్యలు తీసుకున్నారు. అయితే ఆయన బదిలీపై వెళ్లిన తరువాత రెండోసారి సిటీ సీపీగా బాధ్యతలు చేపట్టిన ఆనంద్ ఆచితూచి అడుగులేస్తున్నారు. మొదటిసారి సీపీగా పనిచేసిన సమయంలో ఉన్న దూకుడు చూపించడం లేదనే చర్చ కొనసాగుతున్నది.

### సెటిల్‌మెంట్ల కింగ్..

ఈస్ట్‌జోన్‌లోనే మరో ఏసీపీ తన స్టేషన్ పరిధిలో సివిల్ సెటిల్‌మెంట్లు చేయడంలో కింగ్‌గా మారాడనే విమర్శలు వస్తున్నాయి. ఈయనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే ఎవరు కూడా పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. ఆ ఏసీపీ వేధింపులకు తట్టుకోలేక హైకోర్టును ఆశ్రయిస్తున్నారు. ఆయనపై పలు ఆరోపణలున్నా, చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారనే అభియోగాలున్నాయి.



### సారీతో సద్దుమణిగించారా..?

ఈస్ట్‌జోన్‌లో నెల రోజుల కిందట అన్నాదమ్ముళ్లను స్టేషన్‌కు బలవంతంగా తీసుకొచ్చి చితకబాదారు. కరెంట్ కట్ చేసి వాళ్లపై ఇన్‌స్పెక్టర్ అతడి సిబ్బంది కొట్టారని ఆరోపణలొచ్చాయి. ఎందుకు వాళ్లను స్టేషన్‌కు తీసుకొచ్చి కొట్టారని ఉన్నతాధికారులు ఆరా తీస్తే, ఒక కాంగ్రెస్ నాయకుడు వాళ్ల వద్ద మామూళ్ల కోసం ప్రయత్నం చేశాడని, వాళ్లు దానికి ఒప్పుకోకపోవడంతో స్థానిక ఇన్‌స్పెక్టర్‌తో వాళ్లకు భయం తెప్పించాలనుకున్నాడు. అప్పటికే ఆ ఇన్‌స్పెక్టర్ స్థానిక ఏసీపీకి కూడా వాళ్లపై ఒక కన్నుంది. దీంతో తమ గాడ్ ఫాదర్ అయిన స్థానికంగా ఉండే రాజకీయ నాయకుడు ఆదేశించాడని, బలవంతంగా అన్నాదమ్ముళ్లను స్టేషన్‌కు తీసుకొచ్చి చితకబాదారు. స్థానిక ఇన్‌స్పెక్టర్, ఏసీపీపై ఆరోపణలు వచ్చాయి. దీనిపై బాధితులు సీపీకి కూడా ఫిర్యాదు చేశారు. అయితే సీపీకి బాధితులు ఫిర్యాదు చేసిన మరుసటి రోజే ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులు మరో అధికారితో కలిసి బాధితుల ఇంటికి వెళ్లినట్లు తెలిసింది. ఆ తరువాత అంతా సద్దుమణిగిందంటూ గాడ్ ఫాదర్స్‌తో ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులు ఉన్నతాధికారులకు సారీ చెప్పించి.. ఒప్పించారు.

### నన్నేమీ చేయలేరంటూ..

సెంట్రల్ జోన్‌లో ఒక చర్చి విషయంలో రెండు వర్గాల మధ్య చాలా రోజులుగా వివాదం నడుస్తున్నది. ఒక వర్గంలో ఆధీనంలో ఉన్న పొజిషన్‌ను మరొకరికి ఇప్పించేందుకు స్థానిక ఏసీపీ రూ.50 లక్షలకు డీల్ చేసినట్లు ఆరోపణలున్నాయి. ఏసీపీతో డీల్ కుదర్చడంలో ఒక రాజకీయ నాయకుడు కీలక పాత్ర పోషించాడనే విమర్శలున్నాయి. చర్యలు తీసుకునే సమయంలోనే సీపీ బదిలీపై వెళ్లారు. కొత్త సీపీ వచ్చే వరకు ఈ విషయాన్ని కొందరు అధికారులు తారుమారు చేశారనే ఆరోపణలున్నాయి. అంతలోనే ఆ రాజకీయ నాయకుడు ప్రభుత్వంలోని పెద్దలతో మాట్లాడి ఆ ఏసీపీపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా చూశాడు. ఉన్నతాధికారులకు తప్పుడు రిపోర్టులు పంపించినట్లు సమాచారం. ప్రభుత్వ పెద్దలు కూడా రంగంలోకి దిగి, చర్చి వ్యవహారానికి సంబంధించి, ఏసీపీ గురించి ఎవరూ బయట మాట్లాడవద్దని హుకుం జారీ చేసినట్లు తెలిసింది. వివాదంలో ఉన్న చర్చికి సంబంధించి ఇప్పుడు ఎవరు ఏ పొజిషన్‌లో ఉన్నారని లోతుగా ఉన్నతాధికారులు దర్యాప్తు జరిపితే వాస్తవాలు బయటపడతాయని స్థానికంగా చర్చించుకుంటున్నారు.

